జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
బుధవారం | 25 | ఫిబ్రవరి | 2026 • పేజీలు : 5



## జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన జీడి.హన్సిని (లక్కీ)



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** ఖమ్మం నగరం గుట్టల బజారుకు చెందిన జీడి.హన్సిని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్లో 12వ తరగతి చదువుతుంది. తన చిన్నతనం నుండి సర్దార్ పటేల్ స్టేడియంలో కోచ్ అక్బర్ అలీ వద్ద శిక్షణ తీసుకొని తన క్రీడా ప్రతిభతో అంచెలంచెలుగా ఆడుతూ వరుసగా మూడు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ఆడి జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగింది.ప్రస్తుతం ఈ నెల 24 నుండి మార్చి 1 వరకు హుగ్లీ (పశ్చిమ బెంగాల్లో) వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియ వారు నిర్వహించే 46వ జాతీయ సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనది. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల అధికారి తుంబూరు సునీల్ కుమార్ హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి రెడ్డి కరస్పాండెంట్ రవి మారుత్ మరియు స్టేడియం కోచ్ లు తల్లిదండ్రులు స్థానిక పెద్దలు హన్సినీ అభినందించారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్తమ ప్రతిభ కనబరిచి భారత వాలీబాల్ జట్టులో స్థానం సంపాదించాలని కోరారు.




## ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను
# పకడ్బందీగా నిర్వహించాలి


- ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ థియరీ పరీక్షల నిర్వహణ
- ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలి
- పరీక్షా సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలి
- ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల నిర్వహణ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎస్

### సీఎస్ రామకృష్ణ రావు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను రాష్ట్రంలో పకడ్బందీగా నిర్వహించాలని సి.ఎస్. కే రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై సీఎస్, అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ కె. రామకృష్ణ రావు మాట్లాడుతూ,పరీక్షలు ఎటువంటి రిమార్కులు లేకుండా, సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్షా కేంద్రాలకు ఎవరికీ సెల్ ఫోన్ తీసుకుని రావడానికి అనుమతి లేదని, సీసీ కెమెరాల సమక్షం లోనే ప్రశ్నాపత్రాలు

మిగతా 2 లో...

### భూ పంచాయతీ పరిష్కారం కాలేదని....
# సెల్ టవర్ ఎక్కి ఓ యువ రైతు హాల్చల్



**నేలకొండపల్లి, ఫిబ్రవరి 24 ప్రజాజ్యోతి :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని పైనంపల్లి లో భూ పంచాయతీ ని పరిష్కారం చేయటం లేదని ఓ యువ రైతు సెల్ టవర్ ఎక్కి హాల్చల్ చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలం లోని, చెరువుమాధారం గ్రామానికి చెందిన ఆకుల శ్రీను (38) అనే యువ రైతు కు కుటుంబం నుంచి వచ్చిన భూమి తమ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయటం లేదని...దీని వలన ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు

మిగతా 2 లో...

## తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆదేశాల మేరకు వెలుగు మట్ల భూములు స్వాధీనం



- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
- ఆక్రమణదారుల సామాగ్రి అంబేద్కర్ భవనంలో భద్రపర్చాం
- వెలుగుమట్ల భూదాన్ భూములలో అక్రమ కట్టడాల తొలగింపుపై మీడియా సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్

2 లో...

## రూ.549.95 కోట్ల రూపాయల
# సైబర్ నేరాల దోపిడీ

- మరో 14 మంది అరెస్ట్
- మీడియా సమావేశంలో సైబర్ క్రైమ్ వివరాలు వెల్లడించిన ఎసిపి వసుంధర యాదవ్ ఐపిఎస్

**సత్తుపల్లి, ఫిబ్రవరి24 (ప్రజాజ్యోతి ):** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన రూ.549.95 కోట్ల రూపాయల సైబర్ క్రైమ్ కేసులో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉడతనేని వికాస్ చౌదరిని అరెస్టు చేయటంతో,అతను చెప్పిన వివరాల ప్రకారం అడపా రామ వెంకట చరణ్ చౌదరిని అరెస్టు చేయగా అతను ఇచ్చిన ఫిర్యాదుతో మరో 12 మంది నిందితులను అరెస్టు చేయడంతో కీలక నిందితుడు ఉడతనేని వికాస్ చౌదరి పై మరో కేసు సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యింది. ఈ కేసు కూడా పూర్వపు రూ.. 549.95 కోట్ల రూపాయల సైబర్ నేరాల దోపిడి కేసుకు సంబంధించిన కేసు గానే చెప్తున్నారు ఏసిపి వసుంధర యాదవ్ ఉడతనేని వికాస్ చౌదరి ని నిన్న అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని



మిగతా 2 లో...

## సెల్ టవర్ ఎక్కి ఓ యువ రైతు హల్చల్

(మొదటి పేజీ తరువాయి...)

తమకు అందటం లేదని ఆవేదన చెంది..మంగళవారం సాయంత్రం పైనంపల్లి వద్ద నున్న సెల్ టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకుని స్థానిక పోలీసులు ఘటనా స్థలం కు చేరుకుని శ్రీను తో మాట్లాడే ప్రయత్నం చేశారు. రాత్రి 8- గంటల వరకు సెల్ టవర్ పై ఉండటంతో ఆందోళనకరంగా మారింది. సెల్ టవర్ పై చిమ్మ చీకట్లో ఉండటంతో ఏం జరుగుతుందోనని అంతా టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇటు కుటుంబ సభ్యులు, స్థానికులు, అధికారులు ఫోన్ ద్వారా సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ వినకపోవటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తన భూ పంచాయతీ ని పరిష్కరించే వరకు దిగేది లేదని భీష్మించుకున్నారు. దీంతో అధికారులు సదరు రైతు కు ఎలాంటి ప్రమాదం జరగకూడదని అగ్నిమాపక శాఖ ఫైరింజన్ ను ఘటనా స్థలం లో సిద్ధంగా ఉంచారు. పోలీసులు అప్రమతమైన్నారు. ఏం జరుగుతుందోనని ఇటు పైనంపల్లి, ఆటు చెరువుమాధారం గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఘటనా స్థలం కు చేరుకున్నారు. దాదాపు 2 గంటల తరువాత సెల్ టవర్ దిగటంతో స్థానికులు, కుటుంబ సభ్యులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## అకాల వర్షంనికి రైతన్న విలవిల

- రైతులను నిండా ముంచిన అకాల వర్షాలు
- పాల కంకులపై పడిపోయిన మొక్కలు దయనీయ స్థితిలో రైతులు



**బోనకల్ ఫిబ్రవరి 24 ప్రజాజ్యోతి:** బోనకల్ మండలంలో సోమవారం రాత్రి భారీ ఎత్తున వచ్చిన గాలి అకాల వర్షం రైతులను నిండా ముంచింది,మొక్కజొన్న రైతులను కోలుకోకుండా చేసింది.పలు గ్రామాల్లో వందల ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది.గ్రామాల్లో ఈసారి అధిక మొత్తంలో సాగు చేసిన మొక్కజొన్న మరో నెలలో చేతికి రానున్న తరుణంలో అకాల వర్షం రైతులను పూర్తిగా నష్టపరిచింది,అసలే గతంలో తీవ్ర వర్షాలతో పత్తి పంట పూర్తిగా దెబ్బతినడంతో మొక్కజొన్న పంట మంచి దిగుబడి సాధించి ఆ కష్టాలు నుండి గట్టు ఎక్కుతాం అనే సరికి రైతుల ఆశలు అడియాశలయ్యాయి, దిక్కుతోచని స్థితిలో ఉన్నరైతులను ప్రభుత్వం ఆదుకోని నష్టపరిహారం చెల్లించాలని గోవిందపురం గ్రామ ప్రజలురైతులు తమ ఆవేదన వ్యక్తంచేశారు.

### ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను

# పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి...)

సీల్ ఓపెన్ చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ప్రవేశ ద్వారం వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేసే వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని, పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పరీక్ష హాల్స్ లో త్రాగు నీరు అందించాలని, అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం రవాణా కోసం పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా అనుకూలంగా ఆర్టీసీ బస్సులు పరీక్షా కేంద్రాల రూట్ లలో స్పెషల్ బస్సులు నడపాలని అన్నారు.ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు, కనీస మందులతో పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ స్థానిక సంస్థలు పర్యవేక్షించాలని ఆయన సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్,అధికారులతో మాట్లాడుతూ, పరీక్షా పత్రాలు, జవాబు పత్రాల రవాణా బందోబస్తు తో పటిష్టంగా చేపట్టాలన్నారు. సిబ్బందికి కావాల్సిన అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల రవాణాకు ఆర్టీసీ బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహాయించి, ఏ ఒక్కరికి మొబైల్ ఫోన్ పరీక్షా కేంద్రాల లోకి అనుమతించవద్దని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలాక్ట్రానిక్ పరికరాలు, వాచ్ లకు అనుమతి లేదన్నారు. పరీక్షకు గంట ముందు వాష్ రూం లు సానిటేషన్ చేపట్టి, క్షున్నంగా తనిఖీలు చేసి, ఎటువంటి అనుమానిత వస్తువులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. త్రాగునీటి సరఫరా ఉండాలని, అంతరాయంలేని విద్యుత్ అందించాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు సరిపడ బెంచీలు, ఫర్నీచర్ ఉండాలని, కనీస సౌకర్యాల కల్పన చేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా విద్యాశాఖ అధికారిణి చైతన్య జైని, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. రామారావు, జిల్లా రవాణా శాఖ అధికారి జగదీష్, టిజి ఆర్టీసీ ఆర్ఎం వెంకన్న, మునిసిపల్ కమిషనర్లు మునవర్ అలీ,గురులింగం, సంపత్ కుమార్, రామ్ దుర్గారెడ్డి, నర్సింహ, అధికారులు పాల్గొన్నారు.

## రూ.549.95 కోట్ల రూపాయల సైబర్ నేరాల దోపిడీ

(మొదటి పేజీ తరువాయి...)

వికాస్ చౌదరి తెలిపిన సమాచారంతో మరో నిందితుడు అయిన అడపా రామ వెంకట చరణ్ చౌదరి ని కూడా అరెస్ట్ చేశామని చరణ్ తెలిపిన వివరాల ప్రకారం మరో 12 మందిని అరెస్టు చేశామని వారిని అడపా సూర్య వెంకట తరుణ్, పోట్రు వంశీ,పోట్రు చైతన్య సాయి ,దోసపాటి నవీన్,నల్లబోతుల భవానీ సత్య శేఖర్, కాపుగంటి జోగేంద్ర శేషు, దేవళ్ళ వేణు, మామిడిశెట్టి సాయి కుమార్, పఠాన్ ఇమ్రాన్ ఖాన్,ఉప్పతల గోపి, దొబ్బల వెంకటేష్ లను ఈ రోజు కోర్టులో హాజరుపర చనున్నట్లు,అలానే మరో 8 మంది నిందితులు బొప్పన నాగప్రియ, ఇస్లావత్ లక్ష్మీ కళ్యాణ్, శీలం వేణుగోపాల్ రావు, నల్లంగుల శ్వేతన్, వీరంశెట్టి వంశీ, బిల్లా సాయి తరుణ్, సంగం ప్రవీణ్ కుమార్, భుక్యా తరుణ్ లు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చేస్తున్నామని కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. సైబర్ నేరస్తుల నుంచి చెక్‌బుక్స్, బ్యాంక్ అకౌంట్లు, నెట్ బ్యాంకింగ్‌కు సంబంధించిన కీలక డేటా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఇంకా ఎవరి ప్రమేయం ఉందనే అంశంపై దర్యాప్తు కొనసాగుతోందని ఆమె పేర్కొన్నారు. సైబర్ క్రైమ్‌లో ముఖ్య నిందితుడు ఉడతనేని వికాస్ చౌదరి, అడపా రామ వెంకట చరణ్ చౌదరి తో సహా 12 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు మొత్తం సైబర్ నేరాల దోపిడీ కేసులో ఇప్పటివరకు 36 మందిని అరెస్ట్ చేసినట్లు ఏసిపి వసుంధర యాదవ్ ఐపిఎస్ వివరించారు. రూ.580 కోట్లకు పైగా జరిగిన సైబర్ మోసం వెనుక ఉన్న కీలక విషయాలను



త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. వ్యాపారం పేరుతో అమాయకుల వద్ద బ్యాంక్ ఖాతాలు ఓపెన్ చేయించి, వారి నుంచి ఏటీఎం కార్డులు సేకరించి వాటిని మ్యూల్ అకౌంట్స్ గా ఉపయోగించినట్లు వెల్లడించారు. ఈ మోసం పలు రాష్ట్రాల్లో విస్తరించి ఉందని తెలిపారు.ఈ కేసులో ఇంకెవరి ప్రమేయం ఉందో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ బ్యాంక్ ఖాతాలు ఇతరులకు ఇవ్వకూడదని, బ్యాంక్ ఖాతాలు సైబర్ నేరాల్లో వాడితే,ఇతరులకు ఇచ్చిన ఖాతాదారులూ నేరస్తులుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు, ఓటిపీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ క్రైమ్‌లో ఇరుక్కుంటే కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ తుమ్మలపల్లి శ్రీహరి, ఎస్సై అశోక్ లు పాల్గొన్నారు.

# వెలుగు మట్ల భూములు స్వాధీనం

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆదేశాల మేరకు వెలుగుమట్ల భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి అన్నారు.అదనపు కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెలుగుమట్ల భూదాన్ భూములలో అక్రమ కట్టడాల తొలగింపుపై లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిసిపి ప్రసాద రావుతో కలిసి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ 1953 లో కలవల రాజా రామారావు సర్వే నెంబర్ 147, 148,149 లో 31 ఎకరాల 7 గుంటల భూమి భూదాన్ ఉద్యమంలో దానం చేశారని తెలిపారు. భూ దాన్ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని గమనించిన ఖమ్మం అర్బన్ తహసిల్దార్ 2019లో ఆక్రమణలు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారని తెలిపారు.ఖమ్మం అర్బన్ తహసిల్దార్ జారీ చేసిన నోటీసులను హైకోర్టులో చాలెంజ్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారని, హైకోర్టు తహసిల్దార్ కు భూదాన్ భూముల అంశంలో జ్యూరిస్డిక్షన్ సరిపోదని తెలుపుతూ తహసిల్దార్ ఆర్డర్ పై స్టే ఇస్తూ పిటిషన్ దారులు ఎట్టి పరిస్థితుల్లో కూడా భూదాన్ భూమి స్వభావాన్ని మార్చడానికి వీలు లేదని తెలుపుతూ తీర్పు ఇచ్చిందని తెలిపారు.కొర్లపాటీ పరమేశ్వరి మరో 9 మంది పిటిషన్ దారులు కలిసి 2023 లో భూదాన్ భూములలో నిర్మించిన నిర్మాణాలను తొలగించకుండా ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్ దాఖలు చేశారని, దీనిపై హైకోర్టు స్పందిస్తూ కోర్టుకు సమర్పించిన పట్టా వివరాలు సరిగ్గా లేవని, భూదాన్ భూములలో పేదలు ఇండ్లు నిర్మించుకున్నట్లు దరఖాస్తు సమర్పించారని, పిటిషన్ దారులకు సంబంధించిన నిర్మాణాలను తొలగించవద్దని, నిర్మాణాలు లేకుండా మిగిలి ఉన్న భూమిలో ఎటువంటి కొత్త నిర్మాణాలు చేపట్టవద్దని స్టేటస్ కో జారీ చేసిందని అదనపు కలెక్టర్ తెలిపారు.తెలంగాణ భూదాన్ యజ్ఞా బోర్డు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టిందని, జనవరి 17, 2026 నాడు సంబంధిత పిటిషన్ దారులకు ఎటువంటి కేటాయింపులు చేయలేదని, 5 ఎకరాలు కేజీబీవీ పాఠశాలకు, 5 ఎకరాలు మోడల్ స్కూల్ కోసం మాత్రమే కేటాయింపులు చేసినట్లు తేల్చిందని అన్నారు.భూదాన్ భూములలో నివసిస్తున్న 308 ఆక్రమణదారులకు వెంటనే ఖాళీ చేయాలని జనవరి 17, 2026 న తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు నోటీసులు జారీ చేసిందని అన్నారు. వెలుగుమట్లలో కొంతమంది ఆక్రమణదారులు 2014 లో తమకు అలాట్మెంట్ వచ్చినట్లు కాగితాలు చూపిస్తున్నారని, రికార్డుల పరిశీలనలో ఎటువంటి అలాట్మెంట్ చేయలేదని తేలిందని తెలిపారు.తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఖమ్మం జిల్లా కలెక్టర్ కు సర్వే నెంబర్ 147, 148, 149 లో 2023లో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు రిట్ పిటిషనర్ ఆవుల శిరీష సంబంధించిన నిర్మాణాలు మినహాయించి మిగిలిన భూములు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని ఆదేశించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం పోలీస్ అధికారుల సహాయంతో వెలుగుమట్ల భూదాన్ భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం, హైకోర్టు లో పిటిషన్ దాఖలు చేసిన వారి నిర్మాణాలు మినహాయించి మిగిలిన అక్రమ నిర్మాణాలను తొలగింపు చేశామని అన్నారు.వెలుగుమట్ల భూదాన్ భూములలో ఎవరికి ఎటువంటి అలాట్మెంట్ ప్రభుత్వం చేయలేదని , ప్రభుత్వం ఏకపక్షంగా పేదల ఇండ్ల నిర్మాణాలు కూల్చివేస్తున్నారని సామాజిక మాధ్యమాలలో వస్తున్న వార్తలలో వాస్తవం లేదని, పలు మార్లు రికార్డులు పరిశీలించి విచారణ చేసిన తర్వాత తెలంగాణ భూదాన్ బోర్డు ఆదేశాల మేరకు నేడు ఆక్రమణల తొలగింపు చేపట్టామని అన్నారు.జనవరి 17,2026నాడు తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆక్రమణదారులు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసిందని, ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోమని తెలిపినందున, తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆదేశాల మేరకు వెలుగుమట్ల భూ దాన్ భూములు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడానికి నేడు చర్యలు తీసుకున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు.అట్టి భూములలో కేజీబీవీ, ఆదర్శ పాఠశాల నిర్మాణానికి సంబంధించి కేటాయించిన 10 ఎకరాలు కాకుండా ఎటువంటి కేటాయింపులు చేయలేదని, ప్రస్తుతం ప్రభుత్వం ఆధీనం మాత్రమే చేసుకుందని, ఈ భూమి భవిష్యత్తులో ప్రజా ఉపయోగకరమైన కార్యక్రమాలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు వినియోగించడం జరుగుతుందని అన్నారు. సామాజిక మాధ్యమాలలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని అదనపు కలెక్టర్ అన్నారు.ప్రస్తుతం నిరాశ్రయులైన వారికి కమ్మవారి సంఘంలో తాత్కాలిక వసతి ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ అన్నారు. భూదాన్ భూముల ఆక్రమణదారుల సామాగ్రి భద్రంగా అంబేద్కర్ భవనంలో స్టోర్ చేశామని, సంబంధిత ప్రజలు ఎక్కడికి ఆ సామాగ్రి తరలించాలంటే అక్కడికి తరలించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు.లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిసిపి ప్రసాద రావు మాట్లాడుతూ భూ దాన్ భూముల కేటాయింపు సంబంధించి ప్రజల నుంచి కొంత మంది అక్రమంగా డబ్బులు వసూలు చేసిన వారిపై కేసులు కూడా నమోదు చేయడం జరిగిందని అన్నారు.అనంతరం అదనపు కలెక్టర్ పాత్రికేయులకు ఉన్న పలు సందేహాలకు సమాధానాలు తెలిపారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, పాత్రికేయులు,తదితరులు పాల్గొన్నారు.

# చిన్న పత్రికల, నియోజకవర్గ జర్నలిస్టులకు న్యాయం చేయాలి

- అడిషనల్ కలెక్టర్‌కు టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్ 2843) వినతి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి:** జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల మంజూరులో నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లు, చిన్న పత్రికలలో పనిచేస్తున్న విలేఖరులకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని కోరుతూ టిడబ్ల్యూజేఎఫ్ హెచ్–2843 ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ, ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న నియోజకవర్గ స్థాయి సీనియర్ రిపోర్టర్లు అక్రిడేషన్ ప్రక్రియలో విస్మరించబడటం బాధాకరమని పేర్కొన్నారు. చిన్న పత్రికలలో పనిచేస్తున్న అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు కొనసాగించాలని, నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లకు కార్డుల మంజూరు ప్రక్రియను నిరంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమర్పించిన వినతి పత్రంలో నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడం, చిన్న పత్రికల విలేఖరులకు సమాన అవకాశాలు కల్పించడం, ఇప్పటికే సేవలందిస్తున్న జర్నలిస్టుల అక్రిడేషన్ రద్దు చేయకుండా పునరుద్ధరణ చర్యలు చేపట్టడం వంటి అంశాలను స్పష్టంగా ప్రస్తావించారు. వినతి పత్రాన్ని స్వీకరించిన అడిషనల్ కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి సమస్యను శ్రద్ధగా విని, సంబంధిత అధికారులతో చర్చించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఆవేదనను సానుకూలంగా పరిగణిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్–2843) జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి, కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్, టీ.బీ.జే.ఎ జిల్లా కోశాధికారి కాసోజు శ్రీధర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, పట్టణ సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, గౌరవరపు జగదీష్, మామిడాల వీరబాబు, ఎలిసెట్టి రామకృష్ణ బాబు, వంగ పుంగమ గౌడ్, కరాటే వేణు, పాగా యేనా, భాగ్యరాజ్, సందీప్, పవన్ పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



**నేలకొండపల్లి, ఫిబ్రవరి 24 ప్రజా జ్యోతి:** ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నేలకొండపల్లి మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో మొత్తం 225 మంది, సింగారెడ్డిపాలెం గురకుల పాఠశాల కేంద్రంలో 330 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. ఈ కేంద్రాలలో సీసీ కెమేరాల నిఘా లో పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థుల నెంబర్ల ను కేటాయించారు. ఏర్పాట్లు ను స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, మెడికల్ సిబ్బంది ని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాలలో 144 సెక్షన్ అమలు లో ఉందని పేర్కొన్నారు. మౌళిక వసతులు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాసుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# మున్సిపాలిటీ అభివృద్ధిలో 15వ వార్డుని ముందు ఉంచుతా..

- నల్లమోతు శైలజ సురేష్




**ఖమ్మం వైరా: ఫిబ్రవరి 24 ప్రజా జ్యోతి:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో ఉన్న శివారు గ్రామమైన దిద్దిపూడిని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతారని ఆవార్డు కౌన్సిలర్ నల్లమోతు శైలజ సురేష్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, సిపిఐ డివిజన్ కార్యదర్శి ఎర్రబాబులు కార్మికులతో కలిసి శైలజను సన్మానించారు. సిపిఐ పార్టీ నుండి ఏకైక కౌన్సిలర్ గా ఆమె ఉన్నారు. మృదు స్వభావం కలిగిన, సౌమ్యశీలులుగా దిద్దిపూడిలో శైలజ దంపతులకు మంచి పేరుంది. ఆపేరు బలంతోనే కాంగ్రెస్ దిగ్గజమైనా చైర్మన్ రేసులో ఉన్న, రాంపుడి రోశయ్య కోడలు రాజ్యలక్ష్మి పైన గెలుపొందారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 20 వార్డులు ఉంటే 15 వ వార్డు ఎన్నిక మాత్రం ఉత్కంఠంగా సాగింది. రెండుసార్లు రీపోలింగ్ జరిగిన వార్డు కూడా ఇదే కావటం గమనహారం. మొదటి లెక్కింపులో 13 ఓట్ల మెజారిటీతో నల్లమోతు శైలజ గెలుపొందినట్టు అధికారులు ధ్రువీకరించగా, రాంపుడి రోశయ్య పట్టుబట్టి రీపోలింగు జరగాలని అధికారులపై ఒత్తిడి తేవడంతో రెండోదాప లెక్కించిన ఓట్లల్లో శైలజాకు ఐదు ఓట్లు పెరగటం విశేషం. దాంతో ఆమె 18 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్టు అధికారులు ధ్రువీకరించారు. మళ్లీ రాంపూడి రోశయ్య రీపోలింగ్ జరగాలని వాదించడంతో అధికారులు నిరాకరించి గెలుపు పత్రాన్ని శైలజాకి అందించారు. నరాలుతెగే ఉత్కంఠ మధ్య సాగిన 15వ వార్డు పోరు వైరా మున్సిపల్ చరిత్రలోనే మునుపెన్నడు జరగలేదు. సిపిఐ అనుబంధ కార్మిక సంఘం సన్మానించిన తర్వాత, శైలజ మాట్లాడుతూ 15వ వార్డుకి అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని చెప్పారు. వార్డు రూపురేఖలు మార్చివేసి, మోడ్రన్ వార్డుగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, సిపిఐ డివిజన్ కార్యదర్శి ఎర్రబాబు, వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు, రామాంజనేయులు, గారపాటి అశోక్ పారిశుద్ధ కార్మికులు తదితరులు ఉన్నారు.

# వైరా మున్సిపల్ చైర్మన్.. వైస్ చైర్మన్ లకు ఏఐటియుసి సన్మానం



**ఖమ్మం వైరా: ఫిబ్రవరి 24 ప్రజా జ్యోతి :** వైరా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించాలని, ప్రజల అభిమానం పొందాలని, ప్రజారంజక పాలనను కొనసాగించాలని, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎర్రబాబులు చైర్మన్ – వైస్ చైర్మన్ లను కోరారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ – వైస్ చైర్మన్ లతో పాటు, 15వ వార్డు కౌన్సిలర్ నల్లమోతు శైలజ, నాలుగో వార్డ్ కౌన్సిలర్ నిమ్మతోట శ్రావణిలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలలో వైరా ఒకటి ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీలను వైరా మున్సిపాలిటీనే అనుసంధానం చేస్తుంది అన్నారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్టా సంతోష్ ఇద్దరూ ఉన్నత విద్యను అభ్యసించిన వారేనని ప్రజల కష్ట సుఖాలను నేరుగా తెలుసుకొని పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్వంత ప్రాంతం అవ్వడం చేత ఎక్కువ నిధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకొని మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించటంతో పాటు స్పెషల్ డ్రైవ్ లో నియమించబడిన డైలీ వైస్ కార్మికులకు జీవో నెంబర్ 14 ద్వారా జీతాలు ఇచ్చేలా ఏర్పాటులు చేయాలని కోరారు. తొలి కౌన్సిల్ సమావేశంలోనే ఈ విషయంపై చర్చించాలని ఆయన పాలకవర్గ సభ్యులను కోరారు. అభివృద్ధి విషయంలో పారిశుద్ధ్యం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, పారిశుద్ధ కార్మికులందరూ నూటికి నూరు శాతం అహర్నిశలు శ్రమిస్తారని అన్నారు కార్మికులకు అందించాల్సిన యూనిఫామ్, సబ్బులు, నూనె, గ్లౌజులు, బూట్లు , ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు, నల్లమోతు సురేష్, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు గారపాటి అశోక్, పట్టణ నాయకులు ఎస్కే షరీఫ్, మందా రామకృష్ణ, తగరం గురుమూర్తి మాచర్ల నాగభూషణం, నల్లమోతు సురేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాయపూడి శ్రీనివాసరావు, బోళ్ళ శ్రీను, రేపూడి కన్నయ్య, పిడియాల లక్ష్మయ్య, వీరన్న, ఉప్పతల సాంబ బండారు సైదులు దాసరి కృష్ణ బక్క రాములు బిల్లా ప్రసాద్ షేక్ ముస్తఫా, ఇండ్ల జయరాజు కటుకూరి స్వామిదాస్ ఏఐటియుసి మున్సిపల్ వర్కర్స్ కార్మికులు అందరు పాల్గొన్నారు.

# అక్రిడేషన్ కమిటీలో టిడబ్ల్యుజేఎఫ్‌కు ప్రాతినిధ్యం కోరుతూ డిపిఆర్ఓ కి వినతి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి:** ఖమ్మం జిల్లా అక్రిడేషన్ కమిటీలో టిడబ్ల్యుజేఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని, జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తిని సభ్యుడిగా నియమించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య జిల్లా కలెక్టర్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అక్రిడేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా సాగాలంటే జర్నలిస్టు సంఘాలకు తగిన ప్రాతినిధ్యం అవసరమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లు, చిన్న పత్రికల విలేకరుల సమస్యలను సమర్థవంతంగా కమిటీలో ప్రస్తావించేందుకు టిడబ్ల్యుజేఎఫ్‌కు అవకాశం కల్పించాలని లేఖలో వివరించారు. ఈ లేఖ ప్రతిని జిల్లా డిపిఆర్వో కి అందజేసినట్లు నాయకులు తెలిపారు. వినతి పత్రం సమర్పణ కార్యక్రమంలో జిల్లా నాయకులు, సంఘ ప్రతినిధులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. జిల్లా పరిపాలన జర్నలిస్టుల హక్కులను గౌరవిస్తూ, సముచిత నిర్ణయం తీసుకుని కమిటీలో టిడబ్ల్యుజేఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఐక్యత, హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి, కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్, టీబీజేఎ జిల్లా కోశాధికారి కాసోజు శ్రీధర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, పట్టణ సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, గౌరవరపు జగదీష్, మామిడాల వీరబాబు, ఎలిసెట్టి రామకృష్ణ బాబు, వంగ పుంగమ గౌడ్, కరాటే వేణు, పాగా యేనా, భాగ్యరాజ్, సందీప్, పవన్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు పెన్నులు బహుకరణ

**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి:** మండల పరిధిలో రామాపురం గ్రామం కు చెందిన షేక్ నాగుల్ మీరా తను చదువుకున్న కళాశాల విద్యార్థులకు బుధవారం నుండి ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరవుతున్న వారికి కంగ్రాట్స్ చెప్తూతో ప్రతి ఒక్కరికి పెన్నులు అందించడం జరిగింది అదేవిధంగా పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ప్రతిరోజు బట్టర్ మిల్క్ అందిస్తానని నాగుల మేర హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం శ్యామ్ ప్రసాద్ , రమేష్, సౌజన్య రవి శ్రీనివాస్ రెడ్డి , మరియు మిగతా ఉపాధ్యాయులు, కాలేజీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని పెన్నులు బహుకరించిన నాగుల్ మీరాకు అందరి తరపున ధన్యవాదాలు తెలియజేశారు.



## కౌన్సిలర్ బెజ్జం రాజు నీ సన్మానించిన న్యాయవాది జనార్ధన్

- టిడిపి నాయకులు పొతినేని కృష్ణ



**మధిర ప్రజా జ్యోతి:** ఇటీవల జరిగిన మధిర మున్సిపాలిటీ ఎన్నికల్లో 3వ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన బెజ్జం రాజు ను న్యాయవాది జనార్ధన్ అసిస్టెంట్ శ్రీనివాస్ తన ఆఫీస్ కార్యాలయం లో ఘనంగా సన్మానించారు. ఎప్పుడు కూడా ప్రజలు తరుపున వారి సమస్యల తరుపున పోరాటం చేయాలి అని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పొతినేని కృష్ణ , కొచ్చర్ల దాసు,కొచ్చర్ల వెంకయ్య బాబు,కొచ్చర్ల జయరాజు పాల్గొన్నారు.

## అకాల వర్షాల వల్ల తడిసిన మిర్చి

- నష్ట పరిహారం చెల్లించాలని రైతుల ఆందోళన



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి:** సోమవారం కురిసిన అకాల వర్షా కారణంగా మండల పరిధిలో.అన్ని గ్రామాలకు సంబంధించిన.మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అకాల వర్షాల వలన.వర్షం వల్ల.పూర్తిగా తడిసిపోయిన మిర్చి.పెద్ద గోపరవరం. బనిగండ్లపాడు. రాజులదేర పాడు చెప్పకట్లపాలెం బుచ్చిరెడ్డిపాలెం నరసింహపురం బంజర కండ్రిక జమలపురం నరసింహ పురం లక్ష్మీపురం నికి చెందిన రైతులు.వేముల సత్యనారాయణ.శీలం అప్పి రెడ్డి. వేమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి.ఆరోపల్లి తిరుమలయ్య.మల గురవయ్య. వీర బాబు.నరాల సీతారాం రెడ్డి.గోస్ వెంకటేశ్వర్లు.శీలం కృష్ణారెడ్డి.వేమిరెడ్డి గోపి రెడ్డి.వివిధ రైతులు సంబంధించిన మిర్చి పంట పూర్తిగా తడిసిపోవడం వలన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## తాతా మధు అక్రమ అరెస్టును ఖండించిన మధిర బి ఆర్ ఎస్ పార్టీ

**మధిర ప్రజా జ్యోతి:** ఖమ్మం నగర శివారులో మంగళ వారం ఉదయం కొన్ని వేల మంది పోలీసులతో వెలుగుమట్ల వినోబా నగర్ భూదాన్ భూముల్లో ఉన్నటువంటి పేదల ఇండ్లను తొలగించెందుకు ప్రభుత్వం తీసుకున్న అక్రమ చర్యలను వెంటనే నిలుపుదల చేయాలని ఇండ్ల కూల్చివేతలను అడ్డుకున్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాత మధుసూదన్ రావు అక్రమ అరెస్టును ఖండిస్తూ మధిర టౌన్ మరియు రూరల్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వెంటనే తాత మధు గారిని విడుదల చేయాలని, పేదల ఇండ్ల కూల్చివేతలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ టౌన్ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బొగ్గుల భాస్కర్ రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణ ప్రసాద్, మహాదేవపురం సర్పంచ్ వాసిరెడ్డి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి అరిగే శ్రీనివాసరావు, బిఆర్ఎస్ నాయకులు మొండితోక జయకర్, కొరారి రాఘవరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు, కోన నరేందర్, అబ్బూరి రామన్, వంగవీడు మాజీ సర్పంచ్ బొగ్గుల వీరారెడ్డి, 17వ వార్డు టిఆర్ఎస్ నాయకులు అంగడాల పార్వతి, గోపి తదితరులు పాల్గొన్నారు.




## రజక చిన్నారి బేబీ మౌనిక మృతికి నిరసనగా శాంతియుత ర్యాలీ

**సత్తుపల్లి ఫిబ్రవరి24(ప్రజా జ్యోతి)** నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మెర గ్రామంలో మల్లన్న స్వామి జాతరలో జరిగిన అగ్రవర్ణ దాడిలో అసువులు బాసిన చిన్నారి బేబీ మౌనిక మృతికి నిరసనగా సత్తుపల్లి పట్టణంలో మంగళవారం రజక సంఘం అధ్యక్షుడు విరివాడ నాగభూషణం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి ర్యాలీ చేపట్టిన రజకులు రింగు సెంటర్ మీదగా బాలాజీ థియేటర్, పాత సెంటర్ నుండి చాకలి ఐలమ్మ విగ్రహం వద్దకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన్నారి ఆత్మకు శాంతి ని కోరుతూ కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు నారాయణవరపు శ్రీనివాస్,విరివాడ నాగభూషణం, నిమ్మటూరి రామకృష్ణ, పాలకొల్లు శ్రీనులు




మాట్లాడుతూ అగ్రకుల సర్పంచ్ అహంకారంతో చేసిన దాడిలో అభం శుభం తెలియని చిన్నారి మృతి చెందడం బాధాకరమని, చిన్నారిని హత్య చేసిన అగ్రకుల పెత్తందారులపై తెలంగాణ పోలీస్ ఇప్పటివరకు కేసులు నమోదు చెయ్యకపోవడం హేయమైన చర్య అన్నారు. తక్షణమే అగ్రకుల పెత్తందారి సర్పంచ్, హత్య,దాడిలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై హత్య కేసుతో పాటు అటెంటు మర్డర్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. త్వరలోనే బాధిత కుటుంబాన్ని కలుసుకొని సంఘీభావం తెలుపుతామని, ఈ విషయంపై ఎంతవరకైనా పోరాడడానికి సత్తుపల్లి రజక సంఘం సిద్ధంగా ఉందని హెచ్చరికలు జారీ చేశారు. చాకలి ఐలమ్మ వారసులమని పోరాటంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ప్రస్తుతం శాంతియుతంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని దోషులను కఠినంగా శిక్షించకుంటే రానున్న రోజులలో ఉద్యమం తీవ్ర తరమవుతోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బెల్లంకొండ రాము,పంతంగి నరసింహారావు, పంతంగి మారుతి,ఈలప్రోలు రామ్మూర్తి, చింతల సత్యనారాయణ, కోటా సత్యనారాయణ,నిమ్మగడ్డ శ్రీకాంత్, తెలగారపు అప్పారావు, మరికంటి శ్రీను,టోపి శ్రీను కందుకూరి మారేశ్వరరావు,తెలగారపు సతీష్, రేగళ్ళ నాగేశ్వరరావు,గజ్జల శ్రీను,రాయల కోటేశ్వరరావు,కావేటి అప్పారావు, పంతంగి చెన్నకేశవ, రేగుమూడి చెన్నారావు,గుంపర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రవాణా నివారించడంలో అంగన్వాడీ టీచర్స్ పాత్ర చాలా కీలకం

- జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల. విజేత
- సీడీపీఓ వీర భద్రమ్మ,ప్రజ్వల సమన్వయ కర్త సురేష్ కుమార్




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి:** ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, మహిళా శిషు సంక్షేమ శాఖ ఖమ్మం సమన్వయం తో అంగన్వాడీ టీచర్స్ కీ మనుషుల అక్రమ రవాణా, సైబర్ ట్రాఫికింగ్ పైన రెండు రోజుల శిక్షణ కార్యాక్రమం ను జిల్లా సంక్షేమ అధికారి విజేత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ఒక అంతర్జాతీయ సమస్య, ముఖ్యంగా మహిళలు, అమ్మాయిలు దీని బారిన పడుతున్నారు, ప్రేమ పెళ్లి ఉద్యోగం సినిమా అవకాశాలు డబ్బు ఆశ చూపి అమ్మాయిలను మోసం చేసి వేరే ప్రదేశాలకు తీసుకెళ్లి వ్యభిచార గృహాల్లో అమ్మివేస్తున్నారు. అక్కడ అత్యంత దారుణంగా హింస కు గురి అవుతున్నారు. ఒక మహిళా ఇలాంటి వాటిని తట్టుకునే శక్తి ఉంటుందా, ఇలాంటి వాటిని చూసి ఉపేక్షించకుండా వెంటనే రిపోర్ట్ చేయాలి, ప్రతి అంగన్వాడీ టీచర్ అక్రమ రవాణా పై అవగాహనా పెంచుకుని నివారించడానికి ప్రయత్నం చేయాలి అని అన్నారు.సీడీపీఓ వీర భద్రమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్స్ పాత్ర సమాజ అభ్యున్నతికి ఎంతో అవసరం అని, మన పరిధిలోని మహిళలు, అమ్మాయిలు జాగ్రత్త గా ఉండేలాగా అవగహన కల్పించాలి,ముక్యంగా సైబర్ ట్రాఫికింగ్ ద్వారా సోషల్ మీడియా గేమ్స్ లాంటి వాటి ద్వారా మోసం చేయబడుతున్నారు. ఏదైనా జరిగినప్పుడు భయపడకుండా ఎలా, ఎవరికి సమాచారం ఇవ్వాలి. అనేది తెలుసుకుని అప్రమతంగా ఉండాలని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల వారికి అవగాహనా కల్పించాలి అని అన్నారు.ప్రజ్వల సంస్థ సమన్వయ కర్త సురేష్ కుమార్ మాట్లాడుతూ సంస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అవగాహనా, శిక్షణ కార్యక్రమం లను నిర్వహిస్తున్నము. ఈ శిక్షణలో అక్రమ రవాణా మరియు సైబర్ ట్రాఫికింగ్ ఎలా జరుగుతుంది, అమ్మాయిలను ఎలాంటి హింసకు గురి చేస్తున్నారు. అనే అంశాలు,అదేవిదంగా చట్టాలు భారతీయ న్యాయ సంహిత (బి ఎం ఎస్ ) ఇమ్మోరల్ ట్రాఫికింగ్ ప్రీవెన్షన్ యాక్ట్ పోక్సో యాక్ట్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ జూవెనల్ జస్టిస్ యాక్ట్ లాంటి చట్టాలు, 1098 (చైల్డ్ లైన్) 100 (పోలీస్) 181 (మహిళా హెల్ప్ లైన్) 1930 (సైబర్ ట్రాఫికింగ్ ) ల గురించి వివరిస్తూ అంగన్వాడీ టీచర్సగా సమాజంలో జరుగుతున్న అక్రమ రవాణా నిరోదానికి సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేయాలనీ సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమం లో సూపర్ వైజర్ లు ప్రజ్వల సిబ్బంది అనిల్ కుమార్, మితాలి రాజ్ ఖమ్మం అర్బన్ ప్రాజెక్ట్ లోని అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

- ఆశల అరెస్టులపై సిఐటియు ఖండన




**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి:** తమ న్యాయమైన సమస్యలు ప్రభుత్వానికి విన్నవించుకోవడానికి వెళ్తే అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని ఆశల సమస్యలు వినడానికే సిద్ధంగా లేని కాంగ్రెస్ ప్రభుత్వం ఇది ప్రజా పాలన ప్రభుత్వాం అని ఎలా చెప్పుకుంటుందని కళ్ళు మూసుకుపోయిన ఈ గుడ్డి ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు కళ్యాణ వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తపరిచారు. ఆశా కార్యకర్తలు ఫిక్స్ డ్ వేతనం అమలు పరచాలని పలు డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చి పెద్ద ఎత్తున సోమవారం తరలి వెళ్లిన ఆశా కార్యకర్తల పైన పోలీసులు దౌర్జన్యంగా ప్రవర్తించి అరెస్టులు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఎర్రుపాలెం రింగ్ సెంటర్ నందు సీఐటీయూ జిల్లా నాయకులు మద్దాల ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అక్రమ అరెస్టులను ఖండించారు.ఈ సందర్భంగా కళ్యాణం మాట్లాడుతూ పోలీసుల వలయాలను ఛేదించుకొని హైదరాబాదు చేరుకున్న ఆశ కార్యకర్తలను నిర్బంధించారని మహిళలని చూడకుండా పోలీసులు ఈడ్చివేశారని ఈ ఘటనలో పలువురు ఆశ కార్యకర్తలకు గాయాలయ్యాయని అన్నారు. సోయి లేకుండా ఈ ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. రాష్ట్రంలో 30 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని వీరిలో అత్యధికులు బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలేనని అన్నారు. శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో రోడ్డు ఎక్కాల్సి వచ్చిందని అన్నారు. పెండింగ్ వేతనాలు వేతనాల పెంపు ఉద్యోగ భద్రత 50 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ నేటికీ అమలు కాలేదని విమర్శించారు. ఆశాల సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉవ్వెత్తున పోరాటాలు ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశలకు తగిన నిధులు కేటాయించాలని 18 వేల రూపాయల ఫిక్సిడ్ వేతనం అమలుపరచాలని డిమాండ్ చేశారు. ఆశాలు ఐక్యంగా నిలబడాలని పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కో కన్వీనర్ దూదిగం బసవయ్య,గామాసు జోగయ్య,నంద్రు సుధారాణి, ఆశ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రభుత్వ సానుకూల దృక్పథానికి హర్షం

- మలిదశ ఉద్యమకారిణి పోతురాజు రమాదేవి
- ఉద్యమకారుల సమస్యలపై హైకోర్టు ఆదేశాలకు స్వాగతం
- మలిదశ ఉద్యమకారులకు న్యాయం దిశగా ముందడుగు



ఖమ్మం ప్రతినిధి, ప్రజా జ్యోతి
మలిదశ ఉద్యమకారుల సమస్యలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సానుకూల ఆదేశాలు ఉద్యమకారుల జీవితాల్లో ఆశాకిరణంగా నిలిచాయని మలిదశ ఉద్యమకారిణి పోతురాజు రమాదేవి అన్నారు.న్యాయస్థానం స్పందనతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ముందుకు రావడం పట్ల ఖమ్మం జిల్లా ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఖమ్మం మయూరి సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం మలిదశ ఉద్యమకారిణి పోతురాజు రమాదేవి ఆధ్వర్యంలో కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు.తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు చేసిన ఉద్యమకారుల సేవలను గుర్తించి న్యాయబద్ధమైన పరిష్కారం దిశగా చర్యలు జరుగుతుండటంతో ప్రభుత్వం పట్ల విశ్వాసం మరింత పెరిగిందని పోతురాజు రమాదేవి పేర్కొన్నారు.ఉద్యమకారుల సమస్యలపై సానుకూలంగా స్పందించి చొరవ చూపిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ రెడ్డికి ఉద్యమకారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే హైకోర్టులో ఉద్యమకారుల తరపున బలమైన వాదనలు వినిపించి న్యాయ విజయం దిశగా నడిపించిన న్యాయవాది కరుణాకర్ రెడ్డిని వారు ప్రశంసించారు. ముఖ్యంగా ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, అర్హులైన వారికి పెన్షన్ మంజూరు వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఉద్యమకారుల త్యాగాలకు గౌరవం ఇస్తూ న్యాయం దిశగా సాగుతున్న ఈ చర్యలు తెలంగాణ ప్రభుత్వ ప్రజాస్వామ్య బాధ్యతకు నిదర్శనమని ఉద్యమకారులు పేర్కొన్నారు. ప్రభుత్వం—ప్రజల మధ్య విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం అధ్యక్షురాలు కొరివి ధనలక్ష్మి, కళాకారులు పమ్మి రవి,పాగి వెంకన్న, ఉద్యమకారులు అలవాల నాగేశ్వరరావు, కృష్ణ, మరియా కుమారి,భాగ్యలక్ష్మి, పద్మ, వీరలక్ష్మి, మౌనిక తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఇప్పటికే ముందడుగులు వేస్తుండటం అభినందనీయమని తెలిపారు.

## ప్రజా జ్యోతి వార్తకి స్పందన







ఖమ్మం వైరా: ఫిబ్రవరి 24 (ప్రజా జ్యోతి): పురపాలక ఎన్నికల కోడ్ లో భాగంగా, వైరాలో ఈనెల మొదటి వారంలో రాజకీయ నాయకుల విగ్రహాలకి, పార్టీ గుర్తు ఉన్న స్థూపాలకు ముసుగులు వేశారు. కోడ్ గడుగు ముగిసినప్పటికీ, మధిర రోడ్డులో ఉన్న, సిపిఐ ఎన్నికల గుర్తున్న స్థూపానికి వేసిన ముసుగుని మాత్రం మున్సిపల్ అధికారులు మరిచారు. ఆ విషయాన్ని మంగళవారం ప్రజా జ్యోతి లో ప్రచురించడంతో అధికారులు అప్రమత్తమై ముసుగు తొలగించారు.

## సంఘక్షేమాభివృద్ధి క్రైస్తవ సమాజ బలోపేతమే లక్ష్యం

- క్రైస్తవ సంఘాల క్షేమం కోసం ఎఐసిసి పర్యటనలు వేగవంతం
- రన్ ఫర్ జీసస్ తో సంఘ ఐక్యతకు నాంది
- మండలాల వారీగా సమీక్షలు...
- యూనియన్ బలోపేతంపై దృష్టి
- ఈస్టర్ ముందు మహా కార్యక్రమాలకు ఎఐసిసి సిద్ధం



కల్లూరు, ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి): క్రైస్తవ సంఘాల క్షేమాభివృద్ధి, సమాజ బలోపేతమే లక్ష్యంగా అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ (ఎఐసిసి) కట్టుబడి పనిచేస్తుందని నియోజకవర్గ అధ్యక్షులు రెవరెండ్ పగడం దాస్ తెలిపారు. ఏఐసిసి రాష్ట్ర అధ్యక్షులు ఏనోశ్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, తల్లాడ మండలాల్లో కమిటీ పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులను కలుసుకుని సంఘ క్షేమాభివృద్ధి, క్రైస్తవ సమాజ సమస్యలు, యూనియన్ బలోపేతం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు వెల్లడించారు. మండలాల్లో సేవకుల సహవాస సదస్సులు నిర్వహించడం, స్థానిక సమస్యలను సమీక్షించడం జరిగినట్లు తెలిపారు. రానున్న ఈస్టర్ పండుగకు ముందు రోజు రన్ ఫర్ జీసస్ యేసు కొరకు పరిగెత్తుట అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా కల్లూరు టీజీఎం ప్రేయర్ టవర్‌లో రాష్ట్ర అధ్యక్షుల సూచనల మేరకు త్వరలో నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దాసరి నతానియేల్, కన్వీనర్ మన్నేపల్లి కెనడి రాజు ఐదు మండలాలు కలయ తిరిగారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల అధ్యక్షుడు తేళ్ల ఎబినేజర్, పెనుబల్లి అధ్యక్షుడు కోట దేవదానం, వేంసూరు అధ్యక్షుడు మోదుగు ఒనేసిమ్, సత్తుపల్లి అధ్యక్షుడు ఖమ్మంపాటి రవి, తల్లాడ అధ్యక్షుడు గుర్రాల కరుణాకర్, పైలా దానియేల్, మంచాల యేసుదాసు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ యూత్ కాంగ్రెస్ నిరసనలో పాల్గొన్న జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయి



ఎర్రుపాలెం ప్రజా జ్యోతి: నేషనల్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఉదయ్ భాను చిబ్ గారిని ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో జరిగిన షర్ట్‌లెస్ ప్రొటెస్ట్ గురించి ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు దీనికి వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్ స్టేట్ ప్రెసిడెంట్ జక్కిడి శివచరణ్ రెడ్డి ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల సాయి కుమార్ ఢిల్లీ ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆఫీస్ వద్ద "రిలీజ్ ఉదయ్ భాను నినాదాలతో భారీ నిరసన లో పాల్గొనడం జరిగింది.

## ఆంజనేయ స్వామి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి



సత్తుపల్లి ఫిబ్రవరి 24 (ప్రజా జ్యోతి): పట్టణంలోని లలిత కుమారి హాస్పిటల్ రోడ్ లో గల శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆమెను, మున్సిపల్ చైర్ పర్సన్ రేహానా బేగం, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలతను కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. పూజ అనంతరం వారు ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా ఆకుటి బాబురావు, మాంగతాయారుల కుమార్తె మానస వివాహం సందర్భంగా ఆమెను ఆశీర్వదించినారు. మరియు కాంగ్రెస్ నాయకులు డిఎన్ చారి ఇటీవల గుండెకు స్టంట్ వేయగా, వారి స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. జాగ్రత్తగా ఉండాలని పలు సూచనలు, సలహాలు ఆయనకు అందజేశారు.ఈ కార్యక్రమంలో చల్లగుళ్ళ కృష్ణయ్య,కమల్ పాషా,రఫీ, యూనిస్, గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి,స్వామి వారి భక్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వేదమంత్రాలతో పణితి సైదులుకి ఘన సన్మానం

- సదాఆంజనేయ సమేత భవాని శంకర దేవాలయంలో పూజలు





ఖమ్మం వైరా: ఫిబ్రవరి 24 (ప్రజా జ్యోతి): వైరా మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కౌన్సిలర్ పణితి సైదులుకి మంగళవారం అత్యంత గౌరవ సన్మానం జరిగింది. అవార్డు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు మహిళలు పెద్ద ఎత్తున బ్రాహ్మణపల్లిలో ఏంచేసియున్న దాసాంజనేయ సమేత భవాని శంకర దేవాలయంలో, సైదులు గెలుపుని హర్షిస్తూ, ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు కౌన్సిలర్ సైదుల్ని వేదమంత్రాలతో ఆలయంలోకి స్వాగతం పలికి నిత్యం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, దివ్యమానంగా వెలగాలని, ఎన్నో ఉన్నత పదవులకు చేరుకోవాలని దీవించారు. అనంతరం ముఖ్య అతిథిలుగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకుడు చెరుకూరు చలపతి, పోటు మధు, చెరుకూరి శ్రీను, పైడిపల్లి నాగేశ్వరావు, చావా నాగేశ్వరావు ఆధ్వర్యంలో దేవాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికంగా వచ్చిన మహిళలతోపాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు యువకులు పాల్గొన్నారు.